

# నేను సైతం...




– చైతన్య కామిశెట్టి

విజ్ఞానం ఏ ఒక్కరి సొత్తూ కాదు. ఏ ఒక్క భాషకో, దేశానికో పరిమితం కాదు. దీనికి ఎల్లలు లేవు. అయితే దురదృష్టవశాత్తూ సమాజంలోని కొందరికి మాత్రమే ఇది పరిమితమైంది. దీనికి కారణం ఈ సమాజంలోని వర్గ విభజన. ఈ వర్గ విభజనను ఛేదించుకొని ప్రతి వ్యక్తీ ఓ శక్తి కావాలి. సమానహక్కులనే కాదు, విజ్ఞానాన్ని సొంతం చేసుకోగలగాలి. ఇదే లక్ష్యంతో ఎంతో విలువైన సమాచారాన్ని సేకరించి "వికిపీడియా" వెబ్‌సైట్‌లో వుంచారు. విజ్ఞాన సారస్వాన్ని ప్రపంచ ప్రజలకు చేరువచేయాలనే బృహత్సంకల్పంతో ఎందరో ఔత్సాహికులు నిర్వహిస్తున్న ఈ యజ్ఞంలో "నేను సైతం..." అంటూ కదలండి ముందుకు...

## 'వికిపీడియా' అంటే ఏమిటి?

'వికిపీడియా' ఒక స్వతంత్ర విజ్ఞాన సర్వస్వం. ఇదొక ఆన్‌లైన్ ఎన్‌సైక్లోపీడియా. ఈ ప్రాజెక్టులో ప్రపంచంలోని వివిధ విషయాలపై లభ్యమయ్యే సమాచారాన్నంతా సేకరిస్తారు. ప్రపంచ నలుమూలల నుంచి సామాన్య పౌరులు సైతం ఈ సమాచారాన్నంతా సేకరించి దీనిలో అమర్చడం ఈ 'వికిపీడియా' ప్రత్యేకత. సమాచారంతో కూడిన వ్యాసాలను ఎవరైనా ఇంటర్నెట్ ద్వారా చదవవచ్చు, తప్పులను సరిదిద్దవచ్చు. కొత్త విషయాలను జోడించవచ్చు. 2001లో మొదలైన ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం 1.9 మిలియన్లకు (19లక్షలు) పైగా వ్యాసాలు న్నాయి. దీన్నిబట్టే ఔత్సాహికుల భాగస్వామ్యం ఎంతగావుందో మనకర్థం అవుతుంది. 'వికి పీడియా ఫౌండేషన్' ఇంటర్నెట్ ద్వారా ఈ మొత్తం ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చింది. 'వికి' అనగా 'హవాయి యన్' భాషలో 'చిటికెలో' అని అర్థం. ఇందులో వున్న వ్యాసా లను ఎవరైనా సులువుగా సరిదిద్దవచ్చు. అందుకే దీనికి ఆ పేరు. ఇందులో వున్న వ్యాసాలను సరిదిద్దడం కానీ, కొత్త వ్యాసాలు రాయడం కానీ చాలా సులువు. ఇందుకు ప్రత్యేకమైన అర్హతలు ఏమీ అవసరంలేదు. ఎవరైనా సరే, తమకు తెలిసిన విశేషాలను ఇందులో జతచేయవచ్చు.

## గ్నూ ఫ్రీ డాక్యుమెంట్ లైసెన్స్

'వికిపీడియా'లో వున్న వ్యాసాలన్నీ 'గ్నూ ఫ్రీ డాక్యుమెంట్ లైసెన్స్' పరిధిలోకి వస్తాయి. ఈ లైసెన్స్ ప్రకారం, వికిపీడియాలో వున్న వ్యాసాలను ఎవరైనా వారికి కావలసిన విధంగా వాడుకోవచ్చు. వీటిని కాపీచేసి పంచవచ్చు. మూల వ్యాస రచయిత, ప్రచురణకర్త వివరాలు మార్చకుండా, ఈ వ్యాసాలను ఆధారం చేసుకొని కొత్త వ్యాసాలు రాయవచ్చు. రాసిన కొత్త వ్యాసాలను మళ్లీ 'గ్నూ లైసెన్స్' కిందే విడుదల చేయాలి. ఇలా చేయడం వల్ల దీనిలోని సమాచారం ఎటువంటి కాపీరైట్ చెంగులో పడకుండా అందరికీ స్వతంత్రంగా లభించేలా జాగ్రత్త పడవచ్చు.

## ఇదెలా సాధ్యం?

ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా తమ సమయాన్ని ధారపోసి ఈ "వికిపీడియా"లో సమాచారం జతచేసేవాళ్ళు వుంటారా? అనేది ఎవరికైనా కలిగే మొదటి సందేహం. కానీ అటువంటి వారు లక్షల్లో వున్నారంటే నమ్మక తప్పదుమరి. తమ విజ్ఞానాన్ని అందరితో పంచుకోవాలన్నదే వారి కోరిక. ఇంతమంది రూపొందించే సమాచారాన్ని ఎంతవరకు నమ్మవచ్చనే అనుమానం కూడా రావచ్చు. అందుకే ఉన్నతమైన వ్యాసాలను రూపొందించాలంటే 'వికిపీడియా' వారి నిబంధనలను పాటించాల్సి వుంటుంది. ఈ ఫౌండేషన్ వారు "పికిపీడియా"లో వచ్చే వ్యాసాలను కనిపెడుతూనే వుంటారు. నిబంధనలను ఉల్లంఘించే వ్యాసాలను "వికిపీడియా" నుంచి తొలగిస్తారు. ఒకవేళ ఏ కారణంగానైనా తప్పుడు సమాచారం 'వికిపీడియా'లోకి చేరినా అది తొలగించబడుతుంది.

## ఇతర భాషలలో...

విజ్ఞానం ఎప్పుడూ ఒక భాషకే పరిమితం కాకూడదు. అందుకే "వికిపీడియా" ప్రాజెక్టు ఒక్క ఇంగ్లీషులోనే కాకుండా ఇతర ప్రపంచభాషలలో కూడా ప్రారంభమయింది. ఇందులో ప్రస్తుతం 205 భాషా సంచికలు వున్నాయి. ఇంగ్లీషు తరువాత జర్మన్, ఫ్రెంచ్, జపనీస్, ఇటాలియన్ భాషలలో అత్యధికంగా లక్షకు పైగా వ్యాసాలున్నాయి. ఇక్కడ ఇంకో ముఖ్య విషయం కూడా వుందండోయ్! – ఈ విదేశీ భాషలలో వున్న సమాచారాన్ని సులువుగా ఇంగ్లీషులోకి అనువదించవచ్చు. ఇంగ్లీషుతో సహా మిగతా ప్రపంచ భాషలను సైతం తెలుగులోకి కూడా అనువదించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. తద్వారా సామాన్య జనానికి కూడా అందుబాటులోకి తేవచ్చు. 'వికిపీడియా' తెలుగు సంచికలో ప్రస్తుతం 1600లకు పైగా వ్యాసాలున్నాయి. వీటిని http://te.wikipedia.org నుండి పొందవచ్చు.

## ఇతర ప్రాజెక్టులు

'వికిమీడియా' రూపొందించిన అద్భుతమైన ప్రాజెక్టులు మరికొన్ని వున్నాయి. ఈ ప్రాజెక్టులు కూడా స్వతంత్రంగానే సమాచారాన్ని అందిస్తాయి. ఉదాహరణకు గణితం, సైన్స్, కంప్యూటర్స్, న్యాయశాస్త్రం, హ్యూమానిటీస్ వంటి వివిధ రంగాలకు సంబంధించిన పుస్తకాలు, వ్యాసాలు http://en.wikibooks.orgలో లభ్యమవుతాయి. ఇందులో 11 వేలకు పైగా పుస్తకాలు వున్నాయి. 'వికిసోర్స్' (http://en.wikisoruce.org)లో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మూల గ్రంథాలు అనేక సేకరించబడ్డాయి. పురాతన గ్రంథాలు, చారిత్రాత్మక లేఖలు, పద్యాలు, వ్యాఖ్యానాలు, ఆత్మకథలు, సాహిత్యం వంటి రచనలకు వికిసోర్స్ ఒక పెద్ద గ్రంథాలయం. వీటితోపాటు ప్రముఖ వ్యక్తుల కొటేషన్స్, సామెతలు, వాటి ఆవిర్భావం గురించి కూడా (http://en.wikiquote.org) తెలుసుకోవచ్చు. కొత్తకొత్త ప్రదేశాలను సందర్శించాలనుకునే వారికి కూడా 'వికిట్రావెల్' (http://en.wikitravel.org) లో సమాచారం దొరుకుతుంది. దీనిలో చూడాల్సిన ముఖ్య ప్రదేశాలు, అక్కడకు చేరేందుకున్న మార్గాలు, హోటళ్ళు, అక్కడి వాతావరణం, జీవనశైలితో సహా అన్ని విషయాలు తెలుసుకోవచ్చు.

## విక్షనరీ (Wiktionary)

స్వతంత్రంగా వాడుకోవడానికి వీలుపడే నిఘంటువును అన్ని భాషల్లో సమకూర్చడమే ఈ విక్షనరీ ప్రాజెక్టు లక్ష్యం. దీనిలో పదాల అర్థాలతోపాటు, వాటి ప్రతిపదార్థాలు, ఉచ్చారణ, వ్యతిరేకార్థాలు, వ్యాకరణ విషయాలు వంటి అనేక విశేషాలను తెలుసుకోవచ్చు. ఈ విక్షనరీ 'వికిపీడియా'కు భాషా పార్టనర్‌గా వ్యవహరిస్తుంది. దీనిని http://en.wiktionary.org లో దర్శించవచ్చు.

## వికి న్యూస్

ఇది 'వికిమీడియా' సంచలనాత్మక ప్రాజెక్టు (http://en.wikinews.org). కాపీరైట్‌తో వచ్చే ఎటువంటి ఎగుడుదిగుడులు లేకుండా, భవిష్యత్‌లో రీసెర్చ్‌కి ఉపయోగపడేందుకు వీలుగా వుండే ఒక వార్తా సర్వస్వాన్ని స్వతంత్రంగా అందించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ 'వికిన్యూస్'లో ఎవరైనా వచ్చి వార్తలను తెలియజేయవచ్చు. ప్రతి వార్తతోపాటు అది సరైన సమాచారం అని తెలిపేందుకు తగిన ఉల్లేఖనలు (Citations) అందించాలి. ఇలా చేయడం వల్ల, 'వికిన్యూస్'లో తప్పుడు ప్రచారాలకు తావుండదు. అంతేకాకుండా సమాచారాన్ని తెలియజేసేవారు తాము ప్రత్యక్ష సాక్షులైన సంఘటనలను కూడా చెప్పవచ్చు. అంటే దీనిలోని విశేషమేమంటే సమాచారాన్ని తెలిపేవారే ఒక విలేకరిగా కూడా వ్యవహరించవచ్చు. దీన్నే సిటిజన్ జర్నలిజం అంటారు. ఈ సిటిజన్ జర్నలిజం ద్వారా ఏ వార్తా మీడియా సహకారం లేకుండా, ఎవరికీ భయపడకుండా విషయాలను ప్రపంచానికి తెలుపవచ్చు.

## దీనికే చేయూతనెందుకివ్వాలి?

తరతరాలుగా విజ్ఞానం మన సంఘంలోని కొందరికి మాత్రమే పరిమితమై వుంది. మన సమాజంలో ప్రస్తుతం వున్న సమస్యలన్నిటికీ ఏదోవిధంగా సమాజంలో వున్న విభజనలే కారణం. ఈ విభజనలు తొలగించాలంటే అందరికీ సమానహక్కులతోపాటు, విజ్ఞానాన్ని పొందేందుకు సమాన అవకాశాలను కూడా కల్పించాలి. 'వికిపీడియా' వంటి ప్రాజెక్టులు ఇందుకు తోడ్పడతాయి. రానున్న కాలంలో విజ్ఞానవంతమైన సమాజం (Knowledge Society) స్థాపించడం మనందరి నైతిక బాధ్యత. అందుకు ప్రతి ఒక్కరూ "నేను సైతం..." అంటూ ఈ ప్రాజెక్టులో భాగస్వాములై చేయూతనివ్వాలి. ●

# ఆ రెండు మందులు



మందులు సహజంగా ఒక వ్యాధికోసం తయారు చేసినా దానికి సంబంధించిన ఫలితాలు మిగిలిన అవయవాల మీద కూడా ప్రభావం చూపిస్తుంటాయి. దీనినే మనం 'సైడ్ ఎఫెక్ట్స్' అంటుంటాం. సైడ్ ఎఫెక్ట్స్ అనేవి చెడు ఫలితాలకేకాక, ఒక్కోసారి మంచి ఫలితాలకూ దారి తీస్తాయి. ఇలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ నాడీమండలం మీద పనిచేసే మందుల్లో ఎక్కువగా వుంటాయి. ఈ కోవలోకి వచ్చే మందులే 'పెరోక్సిటిన్', 'సిఎక్స్717'.

**'సిఎక్స్717' :**

'అల్జిమర్స్' వ్యాధి బారిన పడ్డ వారిలో జ్ఞాపకశక్తి తగ్గిపోతుంటుంది. దీనికి మందుగా 'సిఎక్స్717' వాడుతుంటారు. ఈ వ్యాధిగ్రస్తులకు ఇది ఒక వరంగా చెప్పవచ్చు. ఇదే మందు నిద్రలేమితో బాధపడే వారికి కూడా ఒక వరంలా మారింది. ప్రస్తుతం మనిషి 'లైఫ్ స్టైల్'లో వచ్చిన మార్పు వల్ల నిద్రలేమితో బాధపడటం సహజ విషయంగా మారింది. కాల్‌సెంటర్‌లో పనిచేసేవాళ్లు, టార్గెట్లు చేరుకోవడానికి రాత్రింబవళ్లు పనిచేసేవాళ్లు సహజంగా నిద్రలేమితో బాధపడుతుంటారు. దాంతో చురుకుగా, ఉత్సాహవంతులుగా పేరు తెచ్చుకోవాలనుకునే వాళ్లు ఎక్కువగా 'సిఎక్స్717' మందును వాడుతున్నట్లు తెలిసింది. 'సిఎక్స్717' రసాయనం 'మోడఫినిల్', 'నార్కోలెప్సి' అనే మందులలో ఉంటుంది. దానితో ఈ మందులకు విపరీతమైన గిరాకీ పెరిగిందట. ఈ మందు మెదడులోని 'గ్లుటమేట్' అనే నాడీ సందేశాలను పంపే రిసెప్టర్‌ను ఉత్తేజపరుస్తుంది.

'గ్లుటమేట్'ని ఉత్తేజపరచడం ద్వారా అలసట దూరం అవుతుంది. ఉత్సాహంగా పని చేయగలుగుతారు. అందువల్ల రాత్రి సమయాల్లో పనిచేసేవాళ్లు, పని ఒత్తిడి ఎక్కువ ఉండేవాళ్లు అనివార్యంగా దీనిని వాడటం మొదలు పెట్టారట. ఈ రసాయనం మీద అమెరికా డిఫెన్స్ రీసెర్చి ఏజెన్సీలు పెట్టుబడులు పెట్టి పరిశోధనలను ప్రోత్సహిస్తున్నారు. ఈ పరిశోధనలు సత్ఫలితాలను సాధిస్తే, వారి సైనికులకు నిద్ర దూరమైనట్లే. కాకపోతే ఈ మందును అధికంగా వాడటం వలన కలిగే దుష్ఫలితాల మీద ఇంకా పరిశోధన జరగాల్సివుంది.

**'పెరోక్సిటిన్' :**

లక్షలాది ప్రజలు మానసికంగా కృంగిపోవడాన్నుంచి (డిప్రెషన్) బయటపడేందుకు 'పెరోక్సిటిన్' రసాయనాన్ని మందుగా వాడుతున్నారు. 'పెరోక్సిటిన్' రసాయనాన్ని 'సిరోగ్జాట్', 'పక్సిల్' అనే మందులలో ఉపయోగిస్తున్నారు. ఈ మందుల వలన మనలోని భావోద్వేగాలను నియంత్రించే 'సిరోటోనిన్' అనే రసాయనం మెదడులో ఎక్కువ ఉత్పత్తి అవుతుంది.

ఈ 'పెరోక్సిటిన్' వల్ల డిప్రెషన్‌ను దూరం చేయడమే కాకుండా, అది పిల్లలలో ఆత్మహత్యకు సంబంధించిన ఆలోచనలను కలుగచేస్తుందని తెలిసింది. పిల్లలు, యుక్తవయస్సులో ఉన్న వాళ్లకు ఈ మందులు రాయకూడదని షరతులు పెట్టడమేగాక, దీన్ని 2003 నుంచి నిషేధించారు. కానీ ఈ 'పెరోక్సిటిన్' పెద్దల మీద ఎటువంటి ప్రభావం చూపుతుందో కనిపెట్టలేదు. తరువాత లండన్‌లోని మెడికల్, ఆరోగ్య రక్షణ కోసం తయారు చేసే ఉత్పత్తుల నియంత్రణ కమిటీ ఈ మందులను తయారు చేస్తున్న 'గ్లాక్సోస్మిత్‌క్లైన్' కంపెనీ నుంచి నివేదిక కోరింది. వారు చేసిన పరిశోధనలో ఆత్మహత్యకు ప్రయత్నించిన వారిలో ఎక్కువ మంది ఈ మందులు వాడుతున్నట్లు బయటపడింది. కాబట్టి ఈ 'పెరోక్సిటిన్' వాడకంపై ప్రజలను జాగృతం చేయడమేగాక, మానసిక వ్యాధి నిపుణులు ఈ మందుల వినియోగానికి సంబంధించి మరింత జాగ్రత్త వహించాల్సివుంది.

– పావని

# సందేహాలు - సమాధానాలు

**నేను కొత్తగా కంప్యూటర్ కొనుక్కున్నాను. మానిటర్ ఎక్కువకాలం పనిచేయాలి అంటే స్క్రీన్ సేవర్‌ను తప్పనిసరిగా రన్ చేయాలి స్నేహితులు అంటున్నారు. ఇది నిజమేనా? నా మానిటర్ కాలిపోకుండా, ఎక్కువకాలం పనిచేయాలి అంటే ఏం చేయాలి? తెలుపగలరు.**

**– ఎ.రాజరాజేశ్వరి, తిరుపతి**

మా మానిటర్ గురించి మీరు అంతగా ఆందోళన చెందవల్సిన అవసరం లేదు. ఒకప్పటి బ్లాక్ & వైట్ మానిటర్స్‌కు అయితే స్క్రీన్ సేవర్ అవసరం ఉండేది. ప్రస్తుతం వస్తున్న మానిటర్స్ కొత్త టెక్నాలజీలతో తయారు చేయబడుతున్నాయి. వీటి కోసం కొన్ని చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుంది. (1) మీ పని అయిపోగానే మానిటర్‌ను క్రమం తప్పకుండా స్విచ్ ఆఫ్ చేస్తూ ఉండాలి. (2) మీ కంప్యూటర్ పనిచేస్తున్నపుడు ఒక్కొక్కసారి మానిటర్‌ను ఎక్కువసేపు పనిచేయకుండా ఉంచుకోవల్సిన స్థితి వస్తుంది. అలాంటప్పుడు 'ఆటోమేటిక్ ఫర్ డౌన్ ది మానిటర్' అనే ఆప్షన్ ఉంటుంది. దీనిని ఉపయోగించండి. మీరు వాడుతున్న ఆపరేటింగ్ సిస్టమ్ win98 on me అయితే start> setting> Controlpanel> power management properties. Turn of monitor అనే ఆప్షన్‌లో మీకు ఎంత సమయం తరువాత మానిటర్ ఆఫ్ అవ్వాలా ఆ పీరియడ్‌ను ఎంటర్ చేయండి. మానిటర్స్‌కు శత్రువులు ఇంకా రెండున్నాయి. (1) వేడి (2) నీరు. ఎక్కువ వేడిగా ఉన్న సమయంలో పనిచేస్తున్నపుడు ఫ్యాన్‌ను ఉపయోగించాలి. అలాగే తేమ కూడా ఎక్కువ లేకుండా చూసుకోవాలి.




# నిండా మునిగాక ఆ గోలేంటి?

నేకనేక వొచ్చిన సేయితుడికి ఇసాపట్నం చూపెట్టాలనుకున్నాడు సిమాచలం. అనుకున్న రెండోరోజు ఇద్దరూ కల్సి బయలెల్లారు. బీచిలో మనుసులు అంతగా లేనిచోట బండి ఆపాడు సిమాచలం. 'ఓరి బాబో... ఎంత సొవుద్రం. సూసినంతా నీరే. అదేటి... ఆకాసం, సొవుద్రం కలిసిపోనాయి...' తెగ ఆచ్చెరపోయి– సొవుద్రంలో నీలమైపోయాడు అప్పకొండ. 'తరవాత ఆచ్చెరపోవుదుకాని, అటు చూడు, జనం. ఆదివారం పూటయితే ఇసకెత్తే రాలదు. అంత జనమొత్తారు.!' చెప్పేడు సిమాచలం.

'మరింత ఇసకెలావొచ్చిందిరా' అన్నాడు అప్పలకొండ టక్కున.

'ఎటకారం తరువాత. అలా పద ముందుకి' అని రెక్కట్టుకొని ముందుకు నడిపించాడు సిమాచలం. ఎల్లగా ఎల్లగా ఒకసోట... సొముద్రం వొడ్డున ఓ లేప్‌టాప్, ఓ మనిసి ఇడిసిన బట్టలూ, జోల్లూ ఆగుపించాయి. ఎవడో తానమాడుతున్నాడనుకుని, అటేపు సూసాడు అప్పలకొండ. ఆడు సర్దాగా తానం చేత్తున్నట్లునేదు. సొవుద్రంలో మునిగిపోతున్నట్టుంది. ఉక్కిరిబిక్కిరైపోతూ, ఏదో అరుత్తున్నాడు. సిమాచలం ఎనకాముందూ ఆలోచించకుండా గిబుక్కున దూకాడు, సొవుద్రంలోకి. మునిగిపోతున్నవోడి జుట్టట్టుకొని– వొడ్డుకి నాక్కొచ్చాడు. కాసేపటికి ఆ మనిసి తేరుకున్నాడు.

'వురే... సిమాచలం... బాదనీ, సంతోసాన్నీ బాసనేకపోనా అర్దం చేస్కోవొచ్చుగానీ– ఇందాకటోడు మునిగిపోతూ ఏ బాసలోన్రా కేకేసాడు' అనడిగాడు అప్పలకొండ.

'ఓ.. ఆదా... అది కంపూటరు బాస. 'ఎఫ్ వన్ ఎఫ్ వన్' అని అరిసేడు. అంటే 'రచ్చించండి.. రచ్చించండి...' అని.' నవ్వుతూ చెప్పేడు సిమాచలం.

'ఆడి కంపూటరు పేమ సిగతరగ. నీకర్దమయింది గనక కాపాడేవు. మరి నాలాటోడైతే అన్ని రచ్చించటమెలాగ?...' అని నవ్వేసాడు అప్పలకొండ.

– శాంతిమిత్ర.




కంప్యూటర్లు, ఇంటర్నెట్ బ్రౌజింగ్ గురించి తెలిసిన వారెవరైనా ఏదైనా ఒక అంశాన్ని సెర్చ్ చేయాలంటే మొదటగా ఉపయోగించేది గూగుల్ (Google)నే. గూగుల్ అనే పదం ఈ రంగంలో వారికందరికీ నాలుక చివరనే వుంటుందంటే అతిశయోక్తికాదు. తన ఏడవ పుట్టిన రోజును జరుపుకుంటున్న గూగుల్ ప్రపంచంలో ఉపయోగిస్తున్న సెర్చ్ ఇంజన్లలో ప్రథమస్థానంలో వుంది. యాహూ!, ఎం.ఎస్.ఎన్., ఎ.ఓ.ఎల్. వంటివన్నీ ఆ తర్వాతి స్థానాల్లోనే. కోట్లాది పేజీల సమాచారం గల ఇంటర్నెట్‌లో మనకు అవసరమైన అంశాని క్షణాల్లో మన ముందుంచుతున్న 'గూగుల్ సెర్చ్ ఇంజన్' తన వినియోగదారుల సౌకర్యార్థం రకరకాల ఫీచర్స్‌ను అందిస్తోన్నది.

**పుట్టుక:**

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన సెర్చ్ ఇంజన్ 'గూగుల్' ఒక రీసెర్చ్ ప్రాజెక్ట్‌గా ప్రారంభమైంది. ఈ ప్రాజెక్ట్ పేరు 'Back Rub'. దీనిని 1995లో స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీకి చెందిన Sergey Brin, Larry Page లు ప్రారంభించారు. Back Rub అంటే 'బ్యాక్ లింక్‌ల ద్వారా ఫలితాన్ని అందించడం'. యూనివర్శిటీ రీసెర్చ్ స్కాలర్లలో ఈ ప్రాజెక్టు కొంత ఆసక్తిని రేపినప్పటికీ, వాణిజ్యపరంగా ఆదరణ పొందలేదు. అనేక సంస్థలతో కలిసి ఈ టెక్నాలజీ ఆధారంగా సెర్చ్ ఇంజన్ తయారీకి ప్రయత్నించినప్పటికీ సరైన స్పందన రాకపోవడంతో 1998 సెప్టెంబర్‌లో 'Google' పేరుతో స్వంతంగా ఒక సంస్థను స్థాపించారు Sergey Brin, Larry Page లు. సంస్థను ప్రారంభించిన రెండు నెలల్లోనే "టాప్–100"లో ఒకటిగా స్థానం సంపాదించిన గూగుల్, ప్రస్తుతం అనేక భాషలలో రోజుకు సుమారు 800కోట్ల పేజీలను సెర్చ్ చేస్తోంది. అంతేగాకుండా మార్కెటింగ్ కోసం 21 దేశాల్లో తన కార్యాలయాలను స్థాపించింది. అలాగే మొట్టమొదటగా తన రీసెర్చ్ సెంటర్‌ను 'భారత సిలికాన్‌సిటీ'గా పేరుగాంచిన బెంగుళూరులో స్థాపించింది.

**గూగుల్ అంటే?**

Google అనే పదం Googol అనే పదం నుండి వచ్చింది. Googol అంటే 10 to the power of 100 ($10^{100}$). అంటే 1 తర్వాత 100 సున్నాలు పెడితే వచ్చే సంఖ్యతో సమానమైనన్ని పేజీలను ఇండెక్స్ చేస్తుందనే ఉద్దేశంతో ఈ సెర్చ్ ఇంజన్‌కు 'గూగుల్' అని పేరు పెట్టారు. ప్రస్తుతం ఇన్ని పేజీలను అందించకపోయినా భవిష్యత్‌లో తప్పక అందించగలదనే విశ్వాసంతో వారున్నారు.